

ఆగని వర్షం
స్తంభించిన జనజీవనం

● నేడు చెన్నై సహా 4 జిల్లాల్లో స్కూళ్లు, కాలేజీలకు సెలవు

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుఫాన్ తీరందాటకుండానే బలహీనపడుతుండటంతో నగరంలో సోమవారం వేకువజాము నుంచి సాయంత్రం దాకా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. ఆదివారం రాత్రి నుంచే పెనుగాలులతో నగరం, శివారు ప్రాంతాల్లోనూ వర్షం దంచికొట్టింది. వేకువ జామున కాసేపు విరామం తర్వాత ఉదయం 7 గంటల నుంచి వర్షం కురిసింది. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాలకు వాతావరణ కేంద్రం అధికారులు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ఈ జిల్లాల్లో చెదురుమదురుగా వర్షం కురిసింది. చేపాక్, ట్రిప్లికేన్ రాయపేట, మైలాపూరు, పట్టినంబాక్కం, ప్యారీస్ కార్నర్, వాషర్‌మెన్‌పేట, టి.నగర్, కోడంబాక్కం, కీల్పాక్, కోయంబేడు తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి విరామం లేకుండా కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులపై మోకాలిలోతున వర్షపునీరు ప్రవహించింది. దీంతో వాహన చోదకులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నగరంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు హాఫ్‌డే సెలవు ప్రకటించాయి. ఇక నగర శివారు ప్రాంతాల్లోనూ చెదురుమదురుగా వర్షం కురవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారుల్లో వర్షపునీరు ప్రవహిస్తుండటంతో పూందమల్లి - చెన్నై సెంట్రల్, సెంట్రల్ తాంబరం మార్గాలలో వాహనాలు నత్తనడక నడిచాయి. పోరూరు, అయ్యప్పన్ తాంగళ్, పెరుంగుడి, పెరుంగళత్తూరు ప్రాంతాల్లో కొన్ని గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది.

రహదారులపై వర్షపు నీరు వరదలా ప్రవహించడంలో బస్సులు, ఆటోలు, కార్లు నత్తనడక నడిచాయి. ఉదయం 7 గంటల నుంచే పూందమల్లి హైరోడ్డులో సెంట్రల్ వైపు, తిరువేర్కాడు వైపు వెళ్లే బస్సులు గమ్యస్థానాలను గంటకుపైగా ఆలస్యంగా చేరుకున్నాయి. విధంగా పోరూర్ జంక్షన్, గిండి, కోయంబేడు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



నగరంలోని ఓ ప్రాంతంలో చెరువులా మారిన రహదారి

అండమాన్ విమానాల రద్దు...

నగరంలో వేకువజాము నుంచి ఎడతెరపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలు, అండమాన్‌లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అండమాన్‌కు వెళ్లాల్సిన రెండు విమాన సర్వీసులు, అదే విధంగా అండమాన్ నుండి నగరానికి రావాల్సిన రెండు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇదే విధంగా పలు నగరాల వైపు ప్రయాణించే విమానాలు కూడా ఆలస్యంగానే బయలుదేరాయి.

నేడు విద్యాసంస్థలకు సెలవు

సోమవారం రాత్రి భారీగా వర్షం కురిసే అవకాశం ఉన్న చెన్నై, పరిసర జిల్లాలకు వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించడంతో ఆ జిల్లాల్లోని విద్యా సంస్థలకు చెన్నై కలెక్టర్ రష్మి సిద్దార్థ్ మంగళవారం సెలవు ప్రకటించారు. ఇదే విధంగా తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లోని స్కూళ్లు, కాలేజీలకు కూడా ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవు ప్రకటించారు.

జలాశయాల్లో పెరిగిన ఇన్‌ఫ్లో

సోమవారం రోజంతా కురిసిన భారీ వర్షానికి నగరానికి తాగునీరందించే నాలుగు జలాశయాల్లో నీటి పరిమాణం క్రమంగా పెరుగుతోంది. చెంబరంబాక్కం, పుళల్, చోళవరం, పూండి జలాశయాల్లో ఇన్‌ఫ్లో పెరుగుతోంది.





వర్షంలోనే స్కూళ్లకు వెళుతున్న విద్యార్థులు - జల దిగ్బంధంలో పుదుపేట మార్కెట్

ప్రాణ నష్టం జరగకుండా
చర్యలు చేపట్టండి

● అధికారులకు సీఎం దిశానిర్దేశం



తుఫాన్ నష్టాలపై సచివాలయంలో అధికారులతో సమీక్ష జరుపుతున్న సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావం, 'దిత్వా' తుఫాను కారణంగా కుండపోత వర్షాలకు కావేరి డెల్టా జిల్లాల్లో జరిగిన పంట, ఆస్తినష్టంపై ముఖ్యమంత్రి స్టాలిన్ సమీక్ష జరిపారు. చెన్నై సచివాలయంలో సోమవారం ఉదయం జరిగిన అధికారుల సమావేశంలో ఆయన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, రెవెన్యూ విపత్తుల నివారణ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.అముద, విపత్తుల నివారణ కమిషనర్ సీజీ థామస్ వైద్యన్, వ్యవసాయ ఉత్పత్తుల విభాగం కమిషనర్ వి.దక్షిణామూర్తి, వ్యవసాయ శాఖ సంచాలకులు పి.మురుగేష్, ఉద్యానవన సంచాలకులు కుమారవేల్ పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు. గత అక్టోబర్‌లో కురిసిన వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు, ఇళ్లు, పశువులు కోల్పోయిన ప్రజలకు నష్టపరిహారాన్ని తక్షణమే అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. తుఫాను కారణంగా జరిగిన ఆస్తి, పశువుల నష్టంపై జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షం కారణంగా 39 ప్రభుత్వ శిబిరాల్లో ఉన్న బాధితులకు మంచినీరు, ఆహారం, వైద్య సదుపాయాలను సక్రమంగా అందించాలన్నారు. ఎక్కడా ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు చేపట్టాలని, ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని దిశానిర్దేశం చేశారు.

రెండో రోజూ బీచ్ సందర్శనకు ఆంక్షలు...

మెరీనాబీచ్ పొడవునా అలల తాకిడి ఉధృతంగా ఉండటంతో రెండో సోమవారం కూడా సందర్శకులు బీచ్ వద్దకు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు. మెరీనాబీచ్, పట్టినంబాక్కం, మెరీనా, నీలాంగరై, తిరువాన్మియూరు, కాశిమేడు తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం మధ్యాహ్నం దాకా రాక్షస అలలు తీరం వైపు ఎగసిపడుతున్నాయి. అదే విధంగా సర్వీసురోడ్డు అంతా వర్షపునీరు వరదలా ప్రవహిస్తోంది. ఈ కారణాల వల్ల పోలీసులు ఆదివారం బీచ్ వైపు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. సోమవారం కూడా బీచ్‌ను సందర్శించేందుకు పోలీసులు ఎవరినీ అనుమతించలేదు.

చేలల్లో నీరు.. నష్టాల్లో రైతు

● డెల్టా జిల్లాల్లో 2.10 లక్షల ఎకరాల్లో మునిగిన వరిపైరు
● ఇద్దరి మృతి



నాగపట్టణం జిల్లాలో మునిగిన వరి పైరుతో రైతులు

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం, మైలాడుదురై, కారైక్కల్ జిల్లాల్లో సోమవారం కూడా కురిసిన వర్షాలకు డెల్టా జిల్లాల్లో సుమారు 2.10 లక్షల ఎకరాల్లో సాంబా వరి, ఇతర పంటలు నీటమునిగాయి. నాలుగో రోజుకూడా వరి పంట నీటిలోనే ఉండడంతో పూర్తిగా పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'దిత్వా' తుఫాను కారణంగా గత నెల 28 నుంచి నిర్విరామంగా వర్షం కురుస్తోంది. నాగపట్టణం, మైలాడుదురై, కారైక్కల్ జిల్లాల్లో ఆదివారం మధ్యాహ్నం వరకు వర్షం కురవగా, అనంతరం కాస్త ఎడతెరిపి ఇచ్చింది. కానీ, ఆకాశం మేఘావృతంగా ఉండడంతో, బలమైన గాలులు వీయడం, చలి తీవ్రత అధికంగా ఉంది. తిరువారూరు, పెరంబలూరు, అరియలూరు, తిరుచ్చి, పుదుకోట జిల్లాల్లోనూ వర్షాలు తగ్గుముఖం పట్టాయి. నాగపట్టణం జిల్లాలో 80వేల ఎకరాలు, కారైక్కల్‌లో 10వేలు, మైలాడుదురైలో 50వేలు, తిరువారూరులో 50వేలు, తంజావూరు జిల్లాలో 20వేల ఎకరాల్లో సాంబా వరి, ఇతర పంటలు నీటమునిగాయి. భారీవర్షాలతో పలు ప్రాంతాలు ముంపుకు గురవడంతో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 902 మంది సహాయ శిబిరాల్లోనే సోమవారం కూడా గడిపారు. వారికి భోజనం, బస, తాగునీటి వసతి కల్పించిన అధికారులు, వైద్యం కూడా అందించారు. భారీవర్షం కారణంగా నాగపట్టణం జిల్లా తెన్‌పాది కీళ వీధికి చెందిన సరోజ (60) ఇంటి గోడ కూలడంతో, శిధిలాల కింద చిక్కుకుని మృతిచెందింది. అలాగే, మైలాడుదురై జిల్లాలో బైక్‌పై వెళ్తున్న ప్రతాప్ (19) వరద నీటిలో తెగిపడిన విద్యుత్ వైరు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. తిరువారూరులో బలమైన గాలులతో కూడిన వర్షానికి 10 విద్యుత్ స్తంభాలు విరిగిపడగా, 80 గుడిసెలు ధ్వంసమై, 27 పశువులు మృతిచెందాయి. తంజావబూరు జిల్లాలో 11 ఇళ్లు ధ్వంసం కాగా, 8 పశువులు మృతిచెందాయి. నాగపట్టణం జిల్లాలో సోమవారం సెలవు ప్రకటించగా, కారైక్కల్‌లో మాత్రం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దిత్వా ప్రభావం తగ్గినా మైలాడుదురై తీరప్రాంతాల్లో అలలు ఎగసిపడుతూ బలమైన గాలులు వీచాయి. కారైక్కల్ హార్బర్‌లో రెండు రోజులుగా 5వ తుఫాను ప్రమాద హెచ్చరిక, సోమవారం మూడవ ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు.



ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం 'లోక్ భవన్'లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభా పాటవాలు సాధించిన 70 మంది దివ్యాంగులను సత్కరిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి.

7 లో..
నేత్రపర్వంగా నాగూర్ ఉరుసు ఉత్సవం

ఆదికుంభేశ్వరాలయంలో
అట్టహాసంగా మహా కుంభాభిషేకం



గర్భాలయ కలశాలను పవిత్ర జలాలతో సంప్రోక్షణ చేస్తున్న శైవాగమ పండితులు, ప్రధానార్చకులు

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కుంభకోణం ఆదికుంభేశ్వరాలయంలో మహాకుంభాభిషేకం సోమవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. మహామఖం ఉత్సవాల సంబంధి త ద్వాదశ శైవక్షేత్రాల్లో ప్రధానమైన ఈ ఆలయంలో 2009 జూన్ 5న కుంభాభిషేకం జరిగింది. 2028లో మహామఖం వేడుకలు జరుగనున్న దృష్ట్యా అంతకంటే ముందే ఆదికుంభేశ్వరాలయం మహాకుంభాభిషేకం నిర్వహించాలని స్థానికులు, భక్తులు, శైవాగమ పండితులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ప్రధాన పీఠాధిపతులు కూడా ముఖ్యమంత్రికి ఈ విషయమై వినతిపత్రాలు సమర్పించారు. ఆ క్రమంలో ఆ ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు, మహాకుంభాభిషేకం వేడుకలు నిర్వహించేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ రూ.16 కోట్లు కేటాయించింది. ఆ తర్వాత 2023 మార్చి 23న బాలాలయం ఏర్పాటు చేసి జీర్ణోద్ధరణపనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల జీర్ణోద్ధరణ పనులు పూర్తికావటంతో 16 యేళ్ల తర్వాత డిసెంబర్ 1న ఆ ఆలయ మహాకుంభాభిషేకం వేడుకలు జరపాలని నిర్ణయించారు. నవంబరు 24న మహాగణపతి హోమంతో మహాకుంభాభిషేక వేడుకలు ప్రారంభమయ్యాయి. నవంబర్ 27 నుండి మొదటి కాల యాగశాల పూజలతో యాగం ప్రారంభమై 30వ తేదీ వరకు యాగశాల పూజలు జరిగాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మహాకుంభాభిషేక వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఆ సందర్భంగా సోమవారం వేకువజాము 3 గంటలకు విఘ్నేశ్వరపూజ, 8వ కాల యాగశాల పూజ, పుణ్యావహచనం, 5 గంటలకు పరివార పూర్ణాహుతి తర్వాత పవిత్ర జలాల కళశాలను ఆలయ రాజగోపురాల పైకి తీసుకెళ్లారు. ఆ తర్వాత శైవ పండితులు, ప్రధానార్చకుల వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ఉయదం 6.45 గంటలకు విమాన కుంభాభిషేకం, 7.15 గంటలకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకం, విశేషాలంకారం, మహాదీపారాధన జరిగాయి. రాత్రి 7 గంటలకు పంచమూర్తులు వృషభవాహనంలో ప్రధాన వీధులలో ఊరేగారు. ఈ కుంభాభిషేక వేడుకల్లో మంత్రులు పీకే శేఖర్‌బాబు, కోవి చెలియన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, కంచిమఠాధిపతి విజయేంద్ర సరస్వతి, సుబుతీంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

● శివగంగ దుర్ఘటన...
మృతుల కుటుంబాలకు మంత్రుల పరామర్శ



మృతదేహాలకు నివాళులర్పించి, మృతుల కుటుంబ సభ్యులకు పరిహారం అందజేస్తున్న మంత్రులు

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా బస్సు ప్రమాద మృతుల కుటుంబాలను సోమవారం మంత్రులు పరామర్శించారు. జిల్లాలో ఆదివారం రెండు ప్రభుత్వ బస్సులు ఢీకొన్న ఘటనలో 9 మంది మహిళలు సహా 11 మంది మృతిచెందగా, 40 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూ తి తెలుపుతూ, సీఎం సహాయ నిధి నుంచి తలా రూ.3 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పగాయాలైన వారికి రూ.50వేల పరిహారం ప్రకటించారు. సీఎం ఉత్తర్వులతో సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్, రవాణా శాఖ మంత్రి శివశంకర్, జిల్లా కలెక్టర్ పొర్కొడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. శివగంగ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. మృతుల కుటుంబ సభ్యులకు సీఎం ప్రకటించిన రూ.3 లక్షల పరిహారం అందజేశారు. ముందుగా మంత్రి శివశంకర్ మీడియాతో మాట్లాడుతూ... శివగంగ ప్రమాదం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. సీఎం ఆదేశాల మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించామని తెలిపారు. ప్రమాదంపై విచారణకు ఆదేశించామని, నివేదిక అందిక వెంటనే ప్రమాదానికి కారణమైన వ్యక్తులపై చర్యలు చేపడతామని మంత్రి శివశంకర్ తెలిపారు.

ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

శివగంగ జిల్లాలో రెండు ప్రభుత్వ బస్సులు ఢీకొని 11 మంది మృతిచెందడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... శివగంగ జిల్లాలో జరిగిన ప్రమాదం తనకు తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధాని నివారణ నిధుల నుంచి తలా రూ.2 లక్షలు, గాయపడిన వారి కుటుంబాలకు రూ.50 వేలు అందజేయనున్నట్లు ప్రధాన మోదీ ప్రకటనలో తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి
ఈపీఎస్ ఆర్థిక సాయం



అర్జునన్ కుటుంబసభ్యులకు రూ.10లక్షల చెక్కు అందజేస్తున్న ఎడప్పాడి

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా గోపిశెట్టి పాళయం నల్లగవుండన్ పాళ్యంలో ఆదివారం రాత్రి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి రోడ్‌షోలో కార్యకర్తల మధ్య ఏర్పడిన తొక్కిసలాటలో అర్జునన్ (43) అనే కార్యకర్త మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం ఈపీఎస్ గోపిశెట్టి పాళయం చేరుకుని అర్జునన్ కుటుంబీకులను పరామర్శించి పార్టీ జిల్లా శాఖ తరఫున రూ.10లక్షల సహాయాన్ని అందజేశారు. అంతేగాక పార్టీ ప్రధాన కార్యాలయం తరఫున మరో రూ.10లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు.

డబ్బు పంచడం ఒక్కటే సేవ కాదు

● 'తానా' పూర్వాధ్యక్షుడు ప్రసాద్ తోటకూర ● 'ఆలూరి రామస్వామి పూర్ణావతి తెలుగు చారిటబుల్ ట్రస్టు' ప్రారంభం

అడయార్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగారం, వెండి, డబ్బు వంటివి పంచడమే సేవ కాదని, ఆపదలో ఉన్న వారికి చిన్న సాయం చేయడం కూడా సేవేనని 'తానా' పూర్వాధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ పేర్కొన్నారు. విద్యావేత్త డాక్టర్ ఏవీ శివకుమారి తమ తల్లిదండ్రుల స్మారకార్థం 'ఆలూరి రామస్వామి పూర్ణావతి తెలుగు చారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించారు. ఈ ట్రస్ట్ ప్రారంభోత్సవం, లోగో ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి ఆస్కా ప్రాంగణంలో జరిగింది. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తానా పూర్వాధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర ముఖ్య అతిథిగా, ఆదాయపన్ను శాఖ మాజీ ప్రిన్సిపల్ కమిషనరు బి.మురళి కుమార్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ విస్తాలి శంకర రావు అధ్యక్షోపన్యాసం చేస్తూ, సామాజిక సేవా దృక్పథం ఉన్నవారే ఇలాంటి ట్రస్టులను ఏర్పాటు చేసి నిర్వహిస్తుంటారన్నారు. డాక్టర్ శివకుమారి వారి తల్లిదండ్రుల పేరుమీద ట్రస్ట్ ఏర్పాటు చేయాలని సంకల్పించడం గొప్ప విషయమన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ శివకుమారి మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, తన తండ్రి కేంద్ర సర్వీసులో పనిచేసినా నిస్వార్థంగా జీవించారన్నారు. ఆయన పదవీ విరమణ చేసేటప్పటికీ సొంత ఇల్లు కూడా లేదన్నారు. వారి నుంచే తనకు సేవా గుణం వచ్చిందన్నారు. తాను ఉపాధ్యాయురాలిగా పనిచేసిన 40 యేళ్ళ సర్వీసులో ఎంతోమంది విద్యార్థులకు ఫీజులు చెల్లించానని, ఇపుడు ట్రస్ట్ ద్వారా మరింత మందికి సేవ చేయాలన్నదే తన ప్రధాన లక్ష్యమన్నారు. ఇందులో సేవా గుణం కలిగిన వారు కూడా తనతో కలిసి ప్రయాణం చేయవచ్చన్నారు. ఇప్పటికే పలువురు దాతలు తమ ట్రస్ట్‌కు విరాళాలు ప్రకటించారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలన్నారు. విశిష్ట అతిథి మురళీకుమార్ మాట్లాడుతూ.. గత 15 యేళ్ళుగా శివకుమారితో పరిచయముందన్నారు. ఏ పని అప్పగించినా నిస్వార్థంగా పనిచేస్తారన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా ఆమెతో పాటు ఆమె తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరాల కోరారు. ముఖ్య అతిథి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ ప్రాంతంలో తెలుగు ప్రజలున్నప్పటికీ వారందరినీ కలిపేది మూడు అక్షరాల తెలుగు భాషేనన్నారు. తెలుగు భాష, సంస్కృతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజ సేవ అంటే కేవలం డబ్బుతో పాటు విలువైన వస్తువులు పంచడం కాదన్నారు. మనసు పంచడం కూడా సమాజ సేవేనన్నారు. ఈ సందర్భంగా ఆయన ట్రస్టుకు రూ.50 వేలు విరాళం ప్రకటించారు. వసుంధర వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో అతిథులను జేకే రెడ్డి, ఆదిశేషయ్య, కందనూరు మధు సన్మానించారు.



ట్రస్టు లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

సమాచార దర్శిని

5న ఎస్ఎంసీ సమావేశం

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సమావేశాలు ఈ నెల 5వ తేది జరుగనున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు, మెరుగైన బోధన, మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల ప్రవర్తన తదితరాలు పర్యవేక్షించేలా ఎస్ఎంసీ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ కమిటీ ప్రతి నెలా సమావేశం నిర్వహించి పాఠశాలల్లో సమస్యలపై చర్చిస్తుంది. ఈ ప్రకారం, ఈ నెల సమావేశాలు ఈ నెల 5వ తేది మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నారు.

రూ.10.50 తగ్గిన వాణిజ్యగ్యాస్ సిలిండర్

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.10.50 తగ్గి రూ.1,739.50కి విక్రయమవుతోంది. చమురు సంస్థలు ఇళ్లకు 14.20 కిలోలు, వాణిజ్య వినియోగానికి 19 కిలోల గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాయి. ఈ సంస్థలు ప్రతినెలా సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తుంటాయి. ఈ ప్రకారం నవంబరులో వాణిజ్య వినియోగ సిలిండర్ ధర రూ.4.50 తగ్గింది. ప్రస్తుతం రూ.10.50 తగ్గి రూ.1,739.50కి విక్రయమవుతోంది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్, కేకే నగర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... మైలాపూర్ పరిధిలో వళ్లువర్‌కోట్టం సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, కేకే నగర్ పరిధిలో సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో గ్రీవెన్స్ జరుగనుంది. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ కోతలు, మీటర్లు దెబ్బతినడం సహా విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలిపింది.

రూ.2.15 కోట్లతో గిండి బస్టాండ్ పునరుద్ధరణ

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి ఇండస్ట్రియల్ ఎస్టేట్ బస్టాండ్‌ను రూ.2.15 కోట్లతో పునరుద్ధరించనున్నారు. అడయార్ మండలం 168వ వార్డులోని గిండి ఇండస్ట్రియల్ ఎస్టేట్ బస్టాండ్ ఈ మార్గంగా బ్రాడ్‌వే, మైలాపూర్, వేళచ్చేరి ప్రాంతాలు వెళ్లే బస్సులకు రెండు షెల్టర్లున్నాయి. దెబ్బతిన్న ఈ షెల్టర్లు తొలగించి, అధునాతన వసతులతో కొత్త బస్టాండ్ నిర్మించాలని చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. కొత్త బస్టాండ్ నిర్మాణాలకు రూ.2.15 కోట్లు కేటాయించినట్లు, వర్షాకాలం తర్వాత పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

వేళచ్చేరి ఫ్లై ఓవర్ పనుల వాయిదా

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) విజ్ఞప్తి మేరకు వేళచ్చేరి ఫ్లై ఓవర్ పనులు వాయిదావేశారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో... వేళచ్చేరి రోడ్డు జంక్షన్ (ఫినిక్స్ మాల్ సమీపం), ఫైవ్ ఫర్లాంగ్ రోడ్డు జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా, వేళచ్చేరి రోడ్డుపై ఫైవ్ ఫర్లాంగ్ రోడ్డు జంక్షన్ నుంచి గురునానక్ కాలేజ్ జంక్షన్ వరకు రూ.310 కోట్ల అంచనాతో ఫ్లై ఓవర్ నిర్మించాలని జీసీసీ నిర్ణయించింది. ఈ పనులకు టెండరు ప్రక్రియ చివరి దశకు చేరుకున్న సమయంలో, ఫ్లై ఓవర్ పనులు రెండు నెలలు వాయిదావేయాలని సీఎంఆర్ఎల్ లేఖ రాసింది. తాంబరం నుంచి వేళచ్చేరి మెట్రోరైలు ప్రాజెక్ట్ (పళ్లికరనై, కామాక్షి హాస్పిటల్, గురునానక్ కాలేజ్) వేళచ్చేరి మెయిన్ రోడ్డు ఫ్లై ఓవర్ కలిపి సుమారు 650 మీటర్లు నిర్మించనున్నారు. అందువల్ల వేళచ్చేరి ఫ్లై ఓవర్ డిజైన్‌లో మార్పులు చేపట్టాలని సీఎంఆర్ఎల్ విజ్ఞప్తి చేసింది. సీఎంఆర్ఎల్ కోరిక మేరకు ఫ్లై ఓవర్ డిజైన్ మార్పు చేసి, తుది డిజైన్ ఖరారు అయిన తర్వాత రెండు నెలల అనంతరం ఫ్లై ఓవర్ నిర్మాణాలు ప్రారంభిస్తామని జీసీసీ అధికారులు తెలిపారు.

కళాశాలల్లో విపత్తు నిర్వహణ కమిటీలు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్ని కళాశాలల్లో విపత్తు నిర్వహణ కమిటీలు ఏర్పాటుచేయాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శంకర్, అన్ని విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లు, కళాశాల ప్రిన్సిపాల్స్‌కు జారీచేసిన సర్క్యులర్‌లో వివరాలు ఇలా ఉన్నాయి... రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చాయని, అందువల్ల కళాశాలల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్లు, భారీవర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో, విద్యా సంస్థ అధ్యక్షుడు నేతృత్వంలో విపత్తు నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపింది. అలాగే, కళాశాల ప్రిన్సిపాల్ వద్ద ప్రథమ చికిత్స బృందం, కమ్యూనికేషన్ అధికారి, పోలీసు, అగ్నిమాపక సేవలు, ఆస్పత్రులు, అత్యవసర చికిత్సా కేంద్రాలు, రవాణా సేవల వివరాలుండాలి. అలాగే, కళాశాలల్లో విద్యుత పరికరాలు సరిగ్గా పనిచేయకపోతే, వాటికి సత్వరం మరమ్మతులు చేపట్టాలి. కళాశాల ప్రాంగణంలో కూలిన చెట్లు విపత్తు సహాయ శాఖ సహాయంతో తొలగించాలి. దెబ్బతిన్న భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేస్‌క్లబ్ స్థలంలో వాననీటి సేకరణకు

హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలో ఉన్న రేస్‌క్లబ్‌కు లీజుకిచ్చిన భూమిలో వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవచ్చని మద్రాస్ హైకోర్టు అనుమతిచ్చింది. గిండి ప్రాంతంలో రాష్ట్రప్రభుత్వానికి సొంతమైన 118 ఎకరాల స్థలాన్ని గతంలో రేస్‌క్లబ్‌కు లీజుకిచ్చింది. ఇటీవల లీజు ఒప్పందాన్ని రద్దుచేసి ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ స్థలంలో ప్రజలకు వినోదం, ఆహ్లాదం పంచే విధంగా గ్రీన్‌పార్క్‌ను, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని జీసీసీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, రద్దుచేసిన లీజును రెన్యువల్ చేయాలని రేస్‌క్లబ్ తరుపున మద్రాస్ హైకోర్టులో గతంలో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి రేస్‌క్లబ్ నుండి స్వాధీనం చేసుకున్న భూముల్లో ఎలాంటి పథకాలు అమలుచేయకూడదని ఉత్తర్వులిచ్చారు. అయితే ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ జీసీసీ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్ సోమవారం ఉదయం న్యాయమూర్తులు ఎస్ఎం.సుబ్రమణ్యం, జడ్జి మహ్మద్ షఫీ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. వాదనలు విన్న ధర్మాసనం గిండి రేస్‌క్లబ్ స్థలంలో నాలుగు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవచ్చని, ప్రజలకు వినోదాన్ని పంచేలా పార్కులను కూడా నిర్మించవచ్చని తీర్పువెలువరించింది.

నగరంలో 26 శాతం తక్కువ వర్షపాతం

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలతో రాజధాని నగరం చెన్నైలో సాధారణం కన్నా 26 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ మేరకు వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి నవంబరు 30వ తేది వరకు సాధారణ వర్షపాతం 356.6 మి.మీ కాగా, ప్రస్తుతం 384.1 మి.మీ వర్షం కురిసిందన్నారు. అదే సమయంలో, రాజధాని నగరం చెన్నై ఇదే సీజన్‌లో సాధారణ వర్షపాతం 652.2 మి.మీ కాగా, ప్రస్తుతం 480.1 మి.మీ మాత్రమే కురిసిందని వాతవరణ కేంద్రం తెలిపింది.

ప్రమాదంలో ఒకరి మృతి

● మరో ఘటనలో ఒకరికి గాయాలు

తిరువళ్లూరు, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనండంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తిరువళ్లూరులో చోటు చేసుకుంది. తిరువళ్లూరు జిల్లా తిరునిండ్రవూర్, నత్తమేడులోని తిలగర్‌సాలై ప్రాంతానికి చెందిన అహ్మద్ హుస్సేన్ (65) అదేప్రాంతంలో బిర్యానీ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. శనివారం దిచక్ర వాహనంపై తన కుమార్తె ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో జీఎన్‌టి రోడ్డులో గుర్తు తెలియని ఓ వాహనం అతడిని ఢీకొంది. దీనితో అహ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుమారుడు సాదిక్ భాష అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మరో ఘటనలో...

తిరువళ్లూరులోని మనవాలనగర్ ప్రాంతానికి చెందిన బాషా కుమారుడు అబ్దుల్ రజాక్ (23) అదేప్రాంతంలోని పోలివాక్కంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకొని పోలివాక్కం నుంచి తిరువళ్లూరుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. రజాక్ గాయపడగా, స్థానికులు 108 అంబులెన్‌లో తిరువళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మనవాల నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యాన్, బస్సు ఢీ ఇద్దరు మహిళల మృతి



ప్రమాదంలో ధ్వంసమైన బస్సు, వ్యాన్

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కున్నత్తూరు ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో రాష్ట్ర రవాణా సంస్థ బస్సు, వ్యాన్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి మృతి చెందారు. చెన్నై నుంచి పుదుచ్చేరి వెళ్తున్న బస్సు కూవత్తూరు నుండి 20 మంది కార్మికులతో వస్తున్న వ్యాన్ ఢీకొన్నాయి. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న కంపెనీ కార్మికులు ఇద్దరు తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మరణించగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చదురంగపట్టినం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

తిరుప్పూరు కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు



కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసు జాగిలం

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు కలెక్టర్ కార్యాలయానికి ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వ చ్చింది. పోలీసులు బాంబ్ స్క్వాడ్‌తో వెళ్లి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. పోలీసు జాగిలాన్ని కూడా రంగంలోకి దింపారు. చివరకు అదంతా ఉత్తి బాంబు బెదరింపేనని నిర్ధారించారు. తిరుప్పూరు కలెక్టరేట్ బాంబు బెదరింపులు రావటం ఇది మూడోసారి అని అధికారులు తలెపారు. కలెక్టర్ కార్యాలయంలోని అన్ని గదుల లోనూ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత అది ఉత్తుతి బెదిరింపేనని పోలీసుశాఖ అధికారులు పేర్కొన్నారు.

'సర్'పై సుప్రీంకోర్టుకు వెళ్లిన టీవీకే

● కేసు విచారణ 4కు వాయిదా

ప్యారీస్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరుపున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ విచారణ సోమవారం ఉదయం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ప్రథమ ధర్మాసనం ముందుకు విచారణకు రాగా, టీవీకే తరుపున హాజరైన న్యాయవాది సర్ పనుల్లో అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొంటున్నారని, ఇందువల్ల వారిపై పనిభారం అధికమై మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని, టీవీకే తరుపున కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ కూడా రాశామని తెలిపారు. ఇరుతరుపు వాదనల అనంతరం అంగన్వాడీ ఉద్యోగులకు సంబంధించి ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతామని తెలిపి ఈ కేసు విచారణను 4వ తేదీకి వాయిదా వేశారు. అంతేకాకుండా ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా డీఎంకే తదితర పార్టీలు వేసిన పిటిషన్లపై కూడా విచారించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

పూర్తి చేసిన 'సర్' ఫారాలను తిరిగివ్వాలని ప్రచారం

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఫారాలను తిరిగి అందజేయాలని రెవెన్యూ శాఖ అధికారులు గ్రామాల్లో లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో సర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలోని వివరాలు పరిశీలించి, జాబితాలో పేర్లు లేని వారికి ఫారాలు అందజేస్తున్నారు. ఈ ఫారాలు తిరిగి సమర్పించేలా గత నెలలో సుమారు 10 రోజులు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ క్రమంలో, అధికారులు అందజేసిన ఫారాలు పూర్తిచేసి ఈ నెల 11వ తేదీలోపు సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది. ఎన్నికల సంఘం గడువు వరకు వేచి ఉండరాదని, ఫారాలు పూర్తిచేసి వెంటనే అందించాలంటూ రెవెన్యూ శాఖ అధికారుల గ్రామాల్లో ప్రచారం చేపట్టారు.

వేలూరు కలెక్టరేట్‌లో ప్రజా గ్రీవెన్స్



దివ్యాంగుడు ప్రకాష్‌ను అభినందిస్తున్న కలెక్టర్

వేలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శివసుబ్రమణ్యం, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమశాఖ అధికారి మధు చెళియన్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ అధికారి జయచిత్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి అభినందనలు...

గ్రీవెన్స్ కార్యక్రమంలో దివ్యాంగుల ప్రపంచస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ఎఫ్-56 విభాగంలో జావెలిన్ త్రోలో మూడో స్థానంలో నిలిచిన దివ్యాంగుడు ప్రకాష్‌ను కలెక్టర్ సుబ్బులక్ష్మి తన కార్యాలయానికి పిలిపించి అభినందించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఏఎంఎంకే పోటీ

● ఆశావహులకు దరఖాస్తులు: టీటీవీ దినకరన్

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయాలని నిర్ణయించింది. 2026లో అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు సంబంధించి పొత్తు ఖరారు కాని నేపథ్యంలో, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ సోమవారం పార్టీ తరుపున ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆశావరులకు దరఖాస్తులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ మేరకు రాష్ట్రంలోని 234 నియోజకవర్గాలు, కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలోని 30 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ఈ నెల 10వ తేదీ నుండి 18వ తేదీ వరకు అడయార్‌లో ఉన్న ఏఎంఎంకే ప్రధాన కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తామని టీటీవీ దినకరన్ తెలిపారు. తమిళనాడులో పోటీ చేసేందుకు రూ.10వేలు, పుదుచ్చేరిలో పోటీ చేసేందుకు రూ.5వేలు చెల్లించి దరఖాస్తు పొందాల్సిందిగా పార్టీ ఆశావరులకు తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను వచ్చే జనవరి 3వ తేదీలోగా పార్టీ కార్యాలయంలో అప్పగించాలని ఆయన తెలిపారు.

రామేశ్వరంలో కుండపోత

● ఎనిమిది రోజులుగా వేటకు వెళ్లని జాలర్లు



రామేశ్వరం రహదారిలో వర్షపునీటిలో నడిచివెళుతున్న స్థానికులు

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుపాను కారణంగా రామనాథపురం జిల్లా రామేశ్వరంలో సోమవారం ఉదయం 6 గంటలకు కుండపోతగా వర్షం కురిసింది. ఈ భారీ వర్షానికి ప్రధాన రహదారులపై వర్షపు నీరు వరదలా ప్రవహించింది. ప్రభుత్వ ఆస్పత్రి ముందున్న ప్రాంతం పూర్తిగా వాననీటిలో మునిగింది. పాంబన్, ధనుష్కోటి, మండపం ప్రాంతాల్లో పెనుగాలులతో వర్షం కురిసింది. కడలిలో అలల తాకిడి ఉధృతంగా ఉండటంతో జాలర్లంతా గత ఎనిమిది రోజులుగా చేపలవేట మానుకుని ఇంటిపట్టునే గడుపుతున్నారు.

వివాహమైన కొద్దిసేపటికే కొలనులో వరుడి మృతదేహం

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వివాహమైన కొద్దిసేపటికే ఆలయ కొలనులో నవవరుడు మృతదేహం లభ్యం కావడంపై పోలీసులు విచారిస్తున్నారు. రాణిపేట జిల్లా ఆరుంబాక్కం గ్రామానికి చెందిన పెరియస్వామి-ఆనంది దంపతులకు అజిత్ కుమార్ (27) అనే కుమారుడున్నాడు. అతను చెన్నైలో భవన నిర్మాణ పనులకు వెళ్తుంటాడు. అదే ప్రాంతంలో పనిచేస్తున్న సత్య (23) కుటుంబానికి, అజిత్ కుటుంబానికి స్నేహం ఏర్పడింది. ఇరు కుటుంబాల అంగీకారంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి అజిత్‌కుమార్-సత్యల వివాహం అరుంబాక్కం కులక్కరైలోని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో జరిగింది. వివాహం తర్వాత, అజిత్‌కుమార్ పెళ్లి కుమారుడి దుస్తుల్లో ఆలయ కొలను ప్రాంతంలో మూత్రవిసర్జనకు వెళ్లాడు. అరగంట వరకు అతను తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. రెండున్నర గంటల అనంతరం ఆలయ కొలను నుంచి అజిత్ కుమార్ మృతదేహాన్ని వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టంకు తరలించారు. అజిత్‌కుమార్ కాలుజారి కొలనులో పడి మృతి చెందాడా? ఈ వివాహం ఇష్టం లేని వారెవరైనా అతడిని కొలనులోకి తోసి హత్యచేశారా.. ఇలా వివిధ కోణాల్లో విచారిస్తున్నారు.

గ్రామస్తుల చొరవతో పాఠశాలకు మరుగుదొడ్లు



పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో గ్రామస్తులు

తిరుత్తణి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట మండలం వెంకటపెరుమాళ్ రాజాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామ యువకులు వంటగది, మరుగుదొడ్ల నిర్మాణం పనులను గతనెలలో ప్రారంభించారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థిని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినా, ఫలితంలేకపోయేసరికి గ్రామ యువకులు వై.ఇళయరాజా, ఎం.సుబ్రమణి, జె.చెంద్రు, సౌందర్, రమేష్‌కుమార్ భాగస్వామ్యంతో సుమారు రూ.2లక్షలతో పాఠశాలకు వంటగది, మరుగుదొడ్లు నిర్మించారు. సోమవారం ఉదయం హెచ్ఎం పొన్నయ్య ప్రారంభించారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షంవ్యక్తం చేసి గ్రామ యువకులను అభినందిస్తున్నారు.

కార్తిక దీపోత్సవాలకు ప్రత్యేక బస్సులు

● మంత్రి కేఎన్ నెహ్రూ

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తిక దీపోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి 4,764 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ప్రజాపనుల శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. తిరువణ్ణామలైలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... తిరువణ్ణామలై అన్నామలైయార్ రథోత్సవంలో 10 లక్షల మంది భక్తులు పాల్గొన్నారని తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలతో ఆలయ మాడవీధులను విస్తరించడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెద్దసంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ మార్గంలో 720 టాయిలెట్లు, 54 ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. ఈ నెల 3న మహాదీపం కార్యక్రమానికి లక్షలాది మంది వచ్చే అవకాశముందన్నారు. భక్తుల సౌకర్యార్థం చెన్నై సహా పలు నగరాల నుంచి 4,764 ప్రత్యేక బస్సులు నడుపనున్నామన్నారు. అదే సమయంలో, నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా 24 తాత్కాలిక బస్టాండ్లు, 130 ప్రాంతాల్లో కారు పార్కింగ్ వసతి కల్పించినట్లు మంత్రి తెలిపారు.

పూర్వ విద్యార్థుల సంఘం ప్రారంభం



కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు

వేలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలోని ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థినుల సంఘం ప్రారంభమైంది. ఈ నూతన సంఘానికి పూర్వవిద్యార్థిని కలైవాణి ఆర్గనైజర్‌గా, కమిటీ సభ్యులుగా సూర్యకుమారి, ఇందు, లీలాకుమారి, కముద, సుధా, జయంతి, మునియమ్మాళ్, లక్ష్మీ, అర్చన, ఐశ్వర్య తదిరులు ఎన్నుకబడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు జయలక్ష్మి, నర్మదాభాయ్‌లు కమిటీ సభ్యులను అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞాన ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న థామస్ వర్గీస్

తిరువళ్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞాన ప్రాజెక్టులు రూపొందించడంపై దృష్టి పెట్టాలని దక్షిణ భారత వ్యాపార సంస్థ అధ్యక్షుడు థామస్ వర్గీస్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా ఆవడిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రాష్ట్ర స్థాయి రోబోటిక్ పోటీలు నిర్వహించారు. పలు జిల్లాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని తాము తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ప్రారంభించిన థామస్ వర్గీస్ మాట్లాడుతూ, విద్యార్థులు విజ్ఞానంపై అవగాహన పెంచుకొని సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రాజెక్టులను రూపొందించడం సంతోషదాయకమన్నారు. ఇందులో భాగంగా రోబోటిక్, ఎస్‌టిఈఎం, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్, ఐఐటితో పాటు పలు రంగాలలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 195 వినతులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 195 వినతులు రాగా, వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతాప్ అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన గ్రీవెన్స్‌లో విద్య, రెవెన్యూ, ఆరోగ్య, విద్యుత్ సహా పలు శాఖల అధికారులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఈ వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తమిళనాడు ఆది ద్రావిడర్ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరపున 9 మందికి రూ.97.50 లక్షల విలువైన చెక్కులను కలెక్టర్ అందజేశారు. జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన 25 మంది దివ్యాంగులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సమావేశంలో డీఆర్వో సురేష్, ప్రత్యేక సబ్ కలెక్టర్ బాలమురుగన్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఉషా రాణి, వికలాంగుల సంక్షేమ అధికారి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

● కరూర్ దుర్ఘటన ...

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీబీఐ డీఐజీ



తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఐజీ అతుల్ కుమార్ ఠాగూర్

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని సీబీఐ డీఐజీ సోమవారం పరిశీలించారు. కరూర్ వేలుచామిపురంలో సెప్టెంబరు 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట నెలకొని 41 మంది మృతిచెందారు. ఈ ఘటనపై సీబీఐ విచారణకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.ఆ ప్రకారం, ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని సీబీఐ అధికారులు కరూర్‌లో విచారణ చేపట్టారు. ఈ బృందం చేపట్టిన విచారణ ప్రక్రియను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి, ఐజీలు సోనల్ మిశ్రా, సుమిత్ చరణ్ తదితరులతో కూడిన బృందం పర్యవేక్షిస్తోంది. ఆ ప్రకారం, మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలోని బృందం తొలిసారిగా కరూర్‌లో పర్యటించింది. ఈ క్రమంలో, కరూర్ తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని సీబీఐ డీఐజీ అతుల్ కుమార్ ఠాగూర్ నేతృత్వంలోని అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. అనంతరం సీబీఐ కార్యాలయానికి చేరుకున్న డీఐజీ, ఇప్పటివరకు జరిగిన విచారణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

భూములకు నష్టపరిహారం కోరుతూ

రైతుల నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

తిరుత్తణి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణకు తీసుకున్న తమ భూములకు నష్టపరిహారం చెల్లించాలంటూ రైతులు నిరసన బాటపట్టారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని చెన్నై-తిరుపతి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా టీవీపురం, మురుగంపట్టు పంచాయతీల్లోని వ్యవసాయ భూములను 2014వ సంవత్సరంలో నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి రహదారుల శాఖ తీసుకుంది. ఈ నేపథ్యంలో, భూములు తీసుకుని 13ఏళ్ల గడుస్తున్నా తమకు ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదంటూ సోమవారం ఉదయం చెన్నై-తిరుపతి హైవే విస్తరణ పనులను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, రహదారుశాఖ తమకు నష్టపరిహారం చెల్లించలేదని గతంలో మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, దీనిపై విచారించిన న్యాయమూర్తి త్వరితగతిన భూములు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రహదారుశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీచేశారన్నారు. అయినప్పటికీ తమకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా కోర్టు తీర్పు ధిక్కరించారని మరో పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టులో ఇటీవల దాఖలు చేశామన్నారు. ఈ కేసు నడుస్తున్నప్పటికీ జాతీయ రహదారి పనులు మాత్రం ఆగలేదని, అధికారులు చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని, లేకుంటే రైతులంతా శరీరంపై పెట్రోల్ పోసుకుని సామూహిక ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు.

డీఎంకే పాలనలో ప్రజల ప్రాణాలకు భద్రతలేదు

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వంలో ప్రజల మాన, ప్రాణాలకు భద్రతలేదని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఆరోపించారు. ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో, తంజావూరులోని డీఎంకే మాజీ ఎంపీ ఏకేఎస్ విజయ్ ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని ముఠా 300 సవర్ల నగలు, నగదు దోచుకుపోయారన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుడికే రక్షణ కల్పించలేని పరిస్థితిలో డీఎంకే ప్రభుత్వం ఉందని తెలిపారు. డీఎంకే నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో అత్యాచారాలు, దోపిడీలు, హత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా ఇటీవల కోవైలో ఉన్నతాధికారులు, పాత్రికేయులు నివసిస్తున్న అపార్ట్‌మెంట్లో చొరబడిన ఉత్తరాదికి చెందిన కొంతమంది దొంగలు 11 ఇళ్లలో చోరీకి పాల్పడ్డారని, ఈ సంఘటనపై నిర్లక్ష్యం వహించిన పోలీసుశాఖ సమస్యను దారి మళ్లించే విధంగా నాటకమాడుతోందని విమర్శించారు. ఈ రకంగా దోపిడీ దొంగతనాలు, అరాచకాలు రాష్ట్రంలో ఎక్కువైయ్యాయని అన్బుమణి ఆరోపించారు.

విద్యార్థుల భవిష్యత్తు కలను 'ఏఐ'లో చిత్రీకరించిన టీచర్



ఏఐ ఫొటోలతో విద్యార్థులు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివకాశి సమీపం పల్లంపటి ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఇంగ్లీషు ఉపాధ్యాయులు నిషా విద్యార్థుల భవిష్యత్తు కలను ఏఐ ద్వారా ఫొటోలు రూపొందించి ఆశ్చర్య పరిచారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏమి కావాలని 7వ తరగతి విద్యార్థులను టీచర్ కోరారు. అందుకు ఒక్కొక్కరు నర్సు, డాక్టర్, కలెక్టర్, ఐపీఎస్ సహా పలు ఉద్యోగాలు చేయాలని లక్ష్యంగా ఉందని సమాధానం ఇచ్చారు. విద్యార్థులు తాము ఇష్టపడుతున్న ఉద్యోగంలో చేరితే వారు ఎలా ఉంటారనేది ఏఐ టెక్నాలజీ ద్వారా ఫొటోలు చిత్రీకరించిన టీచర్ నిషా, వాటిని విద్యార్థులకు అందజేశారు. వాటిని చూసి విద్యార్థులు ఆనందభరితులై, భవిష్యత్తులో తాము ఇలానే ఉంటామంటూ పేర్కొన్నారు.



దక్షిణాది చిత్రాల్లో హద్దులున్నాయ్

● రాశీఖన్నా

బాలీవుడ్‌తో పోల్చితే దక్షిణాది చిత్రాల్లో కొన్ని హద్దులు (బౌండరీస్) ఉన్నాయని ప్రముఖ హీరోయిన్ రాశీ ఖన్నా అభిప్రాయపడ్డారు. ఇటీవలి కాలంలో సౌత్‌లో ఆమెకు సినిమా అవకాశాలు తగ్గాయి. దీంతో మళ్లీ బాలీవుడ్ వైపు దృష్టిసారించారు. ఇదే విషయంపై రాశీఖన్నా స్పందిస్తూ, 'దక్షిణాది చిత్రాలతో పోలిస్తే ఉత్తరాది చిత్రాల్లో సరిహద్దులు లేవు. సౌత్‌లో అనేక కమర్షియల్ చిత్రాల్లో నటించినప్పటికీ ఇపుడు హిందీలో ప్రవేశించేందుకు ఇదే సరైన తరుణం. కథ డిమాండ్ మేరకు అనేక అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణాదిలో కమర్షియల్ చిత్రాల్లో నటించడం ఇష్టమే అయినప్పటికీ ఇక్కడ నాకంటూ కొన్ని హద్దులున్నాయి. నటిగా ఈ హద్దులను దాటి నా ప్రతిభను నిరూపించుకుని, నాకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకోవాల్సి ఉంది' అని పేర్కొన్నారు.

నిర్మాతగా మారిన 'డాడా' డైరెక్టర్

'డాడా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని రూపొందించిన యువ దర్శకుడు గణేష్ కె. బాబు నిర్మాతగా మారారు. డ్రాఫ్ట్ బై జీకేబీ పతాకంపై ఒక చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఇందులో యువ హీరో గౌతమ్ రామ్ కార్తీక్, హీరోయిన్ అంజనా నేత్రన్ జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఇందులో దర్శకులు హెచ్.వినోద్, రాజుమురుగన్, నిర్మాత ఫైవ్‌స్టార్ కె.సెంథిల్ తదితరులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాలో సీనియర్ దర్శకుడు సెల్వరాఘవన్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. రియల్ లైఫ్ పాలిటిక్స్, కామెడీ జానర్‌లో రూపొందే ఈ చిత్రానికి దర్శకుడు రాజ్ మురుగన్ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన దినా రాఘవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ఇదిలావుంటే, కోలీవుడ్‌లో ఓ ట్రెండ్ కొనసాగుతోంది. యువ దర్శకులు నెల్సన్ దిలీప్ కుమార్, లోకేష్ కనకరాజ్, అట్లీ, సినిష్ వంటి పలువురు నిర్మాతలుగా మారుతున్నారు. ఈ జాబితాలో గణేష్‌బాబు కూడా చేరారు. అలాగే హీరో గౌతమ్ కార్తీక్ కూడా తన పేరుతో గౌతమ్ రామ్ కార్తీక్‌గా మార్చుకున్నారు. కోలీవుడ్‌లో తన పేరుతో తండ్రి, తాత పేర్లను చేర్చుకున్న ఏకైక హీరోగా గౌతమ్ నిలిచారు.



కొత్త చిత్రం ప్రారంభోత్సవ దృశ్యం

చిత్రజ్యోతి



రియో రాజ్ 'రామ్ ఇన్ లీలా' ఫస్ట్‌లుక్ రిలీజ్

'ఆణ్‌పావం పొల్లాదదు' చిత్రంతో విజయాన్ని అందుకున్న రియో రాజ్ హీరోగా కొత్తగా నటించే చిత్రానికి 'రామ్ ఇన్ లీలా' అనే టైటిల్ ఖరారుచేసి, మూవీ ఫస్ట్‌లుక్‌ను సోమవారం రిలీజ్ చేశారు. ట్రైడెంట్ ఆర్ట్స్, వైవా ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వర్తికా జైన్ హీరోయిన్. రామచంద్రన్ కన్నన్ దర్శకుడు. 'ఇది రొటీన్ లవ్‌స్టోరీ కాదు ప్రేక్షకులారా... నా రామ్ లీలా' అంటూ ఈ ఫస్ట్‌లుక్ కింద హీరో కామెంట్స్ చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో శరవేగంగా సాగుతోంది. మరోవైపు, ప్రముఖ దర్శకుడు మిష్కిన్ సూచన మేరకు రియో రాజ్ ఈ మూవీ స్టోరులో తన పేరును రియోగా పేర్కొనడం గమనార్హం.

సీనియర్ దర్శక నిర్మాత దేవదాస్ కన్నుమూత



ఎస్.ఎస్.దేవదాస్ (ఫైల్‌ఫొటో)

అడయార్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అలనాటి దిగ్గజ సినీ దర్శక నిర్మాత ఎస్.ఎం.ఎస్.సుందరరామన్ కుమారుడు, హీరోయిన్ కనక తండ్రి, సీనియర్ సినీ దర్శకుడు ఎస్.ఎస్.దేవదాస్ (88) కన్నుమూశారు. అనారోగ్యంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందు తూ ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రముఖ దర్శకుడు భీమ్‌సింగ్ 'ప' అక్షరం టైటిల్స్‌తో తెరకెక్కించిన అనేక తమిళ, హిందీ చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేశారు. ప్రముఖ నటి దేవికను ప్రేమ వివాహం చేసుకుని ఆ తర్వాత విడిపోయారు. ఈ దంపతుల సంతానమే నటి కనక మహాలక్ష్మి అలియాస్ కనక. మొదటి భార్యతో తెగదెంపులు చేసుకున్న తర్వాత దేవదాస్ తన కుమార్తె కనకతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోలేదు. ఆయన 1938 ఆగస్టు 3న మదురైలో జన్మించారు. ఆయన అయ్యప్ప భక్తుడు కావడంతో గురుస్వామి ఎంఎన్ నంబియార్ ప్రేమాభిమానాలు పొందారు. క్రమం తప్పకుండా 40 యేళ్ళపాటు శబరిమలై వెళ్ళి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నారు. 'వెకులిపెణ్' అనే చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో నిర్మించి దర్శకత్వం వహించారు. మలయాళ చిత్రానికి కూడా దర్శకత్వం వహించారు. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నేత్రపర్వంగా నాగూర్ ఉరుసు ఉత్సవం

● హాజరైన సంగీత దర్శకుడు రెహమాన్

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగపట్నం జిల్లా ప్రసిద్ధిగాంచిన నాగూర్ దర్గాలో 469వ వార్షిక ఉరుసు ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. గత నెల 21న దర్గా మీనార్లపై పతాకాన్ని ఆవిష్కరించి ఉరుసు ఉత్సవాలు ప్రారంభించారు. ఇందులో ప్రధానంశమైన పవిత్ర గంధపాత్ర ఉత్సవం సోమవారం తెల్లవారుజామున ప్రారంభం కాగా, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖులు, ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముస్లిం మతగురువుల ప్రార్థనల అనంతరం గంధం పాత్ర ఊరేగింపు నాగపట్నంలో ప్రారంభమైంది. ప్రస్తుతం ఆ జిల్లాలో వర్షం భారీగా కురుస్తున్నప్పటికీ ముస్లింలు వర్షంలో తడుస్తూనే ఊరేగింపులో పాల్గొని నాగూర్ చేరుకున్నారు. ఉరుసు ఉత్సవాన్ని పురస్కరించుకుని నాగూర్ దర్గాను, మీనార్లను విద్యుద్దీపాలతో అలంకరించారు. గంధపాత్ర ఊరేగింపు సాగిన మార్గంలో పేదలకు సంక్షేమ సహాయాలు అందజేశారు. నాగపట్నం నుంచి బయలుదేరిన ఈ ఊరేగింపు ఉదయం 6 గంటలకు నాగూర్ దర్గా ప్రాంగణానికి చేరుకుంది. ప్రార్థన చేసిన అనంతరం చందనం పాత్రను దర్గా ప్రాంతంలోని సమాధులకు పూసే కార్యక్రమం నిర్వహించారు. ఈ వైభవంలో రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పలు రాష్ట్రాల నుండి భక్తులు పాల్గొని విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు.

నాగూర్‌లో ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు →





పూండి జలాశయం నుంచి విడుదల చేస్తున్న జలాలు

'పూండి' నుంచి నీటి విడుదల తగ్గింపు

తిరువళ్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పూండి జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీటిని అధికారులు తగ్గించారు. తిరువళ్లూర్ జిల్లాలోని ప్రధాన జలాశయం, చెన్నై నగరవాసులకు తాగునీరందించే జలాశయాల్లో ఒకటైన పూండి జలాశయం పూర్తి సామర్థ్యం 35 అడుగులు కాగా శుక్రవారం గణంకాల ప్రకారం, నీటిమట్టం 34 అడుగులుంది. ఈ నేపథ్యంలో, దిత్వా తుఫాను ప్రభావంతో తిరువళ్లూర్ జిల్లాలో అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ కారణంగా డ్యాం భద్రత దృష్ట్యా డ్యాంలోని రెండు షట్లర్ల ద్వారా శుక్రవారం 1,300 ఘనపుడుగులు, శనివారం 3,500 ఘనపుటడుగుల చొప్పున నీటి దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలో, తుఫాను ప్రభావంతో ఆశించిన వర్షం కురవకపోవడంతో జలాశయానికి వచ్చే నీరు తక్కువగా ఉంది. ఈ కారణంగా జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీటిని 1,150 ఘనపుటడుగులకు తగ్గించారు. కాగా, జిల్లాలో తుఫాను బాధితులను ఆదుకొనేలా ఆవడిలో రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 9 అగ్నిమాపక సిబ్బంది బృందాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా యంత్రాంగం తెలిపింది.



అవార్డులు అందుకున్న రెప్కో మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులు

రెప్కో మైక్రో ఫైనాన్స్‌కు ప్రతిష్ఠాత్మక ఎన్‌బీఎస్‌సీ అవార్డులు

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై ప్రధాన కేంద్రంగా వున్న రెప్కో బ్యాంక్‌కు అనుబంధ సంస్థ అయిన రెప్కో మైక్రోఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్ఎంఎఫ్ఎల్) నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీస్ (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి మూడు అవార్డులు పొందింది. తక్కువ వడ్డీలకు రుణాలిస్తూ, మహిళల్లో ఆర్థిక స్థోమత పెంచేలా విశేషమైన కృషి చేస్తున్నందుకు ఈ అవార్డులు లభించాయి. ఇటీవల ముంబయిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను నిర్వాహకులు బహూకరించారు. అదే విధంగా సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఏజీ వెంకటాచలంకు నిర్వహణా ప్రతిభా పురస్కారం, ఆర్థిక వ్యవహారాల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించినందుకు గాను సీఎఫ్ఓ పి.సెంథిల్‌కుమార్‌కు ప్రతిభాపురస్కారం ప్రదానం చేశారు.

మాధవరంలో ఏఆర్ఎస్ స్టీల్ కొత్త గోదాము ప్రారంభం



సరకుల లోడు లారీకి పచ్చజెండా ఊపుతున్న ఏఆర్ఎస్ స్టీల్ ఎండీ అశ్వనికుమార్ భాటియా

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీఎంటీ స్టీలు ఉత్పత్తిలో పేరొందిన ఏఆర్ఎస్ గ్రీన్ స్టీల్స్ మాధవరంలో 7వ గోదామును ప్రారంభించింది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అశ్వని కుమార్ భాటియా ఈ గోదాము ప్రారంభించి ఇనుపకమ్మీల లోడు లారీకి పచ్చజెండా ఊపారు. ఆ గోదాము నుంచి నగరంలోని కీలకమైన ప్రాంతాలకు రెండు గంటల్లో సామగ్రిని సరఫరా చేయగలుగుతామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. సేలం, తిరుచ్చి, కోవై, కృష్ణగిరి, విల్లుపురం, పడప్పై మాధవరంలోనూ తమ సంస్థకు గోదాములున్నాయని పేర్కొన్నారు.

సెమ్మొళి పార్క్ సందర్శనకు అనుమతి వాయిదా



పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పనులు పూర్తికాకపోవడంతో సెమ్మొళి పార్క్‌లో సందర్శకులకు అనుమతి వాయిదాపడింది. కోయంబత్తూర్‌లో 45ఎకరాల్లో రూ.208.50 కోట్లతో సెమ్మొళి పార్క్‌ను గత నెల 25వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. సోమవారం (ఈ నెల 1వ తేది) నుంచి పార్క్ ప్రజల సందర్శనకు అనుమతించనున్నట్లు పురపాలకశాఖ మంత్రి నెహ్రూ గతంలో ప్రకటించారు. కానీ, పనులు పూర్తికాకపోవడంతో సోమవారం ప్రజలను అనుమతించలేదు. పనులు పూర్తయ్యాక ప్రజలను అనుమతిస్తామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

శ్రీరంగనాథుడికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలతో టీటీడీ చైర్మన్, అధికారులు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సతీసమేతంగా సోమవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న చైర్మన్‌ను శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ శివరామన్, ప్రధానార్చకులు సుందరభట్టార్ సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం టీటీడీ చైర్మన్ పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి స్వామి వారికి సమర్పించారు. దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. కైశిక ఏకాదశిని పురస్కరించుకుని 2006 నుంచి శ్రీరంగం ఆలయానికి టీటీడీ పట్టువస్త్రాలను సమర్పిస్తోంది. ప్రాచీన శ్రీవైష్ణవాలయాలతో ఆధ్యాత్మిక సంబంధాలను కొనసాగించేందుకు టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు నరేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



జోరుగా మట్టి ప్రమిదల విక్రయాలు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తిక దీపోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మట్టి ప్రమిదల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది కార్తిక దీపోత్సవాన్ని బుధవారం జరుపుకోనున్నారు. ప్రజలు తమ ఇళ్ల, కార్యాలయాల వద్ద దీపాలు వెలిగిస్తుంటారు. అందుకోసం ప్రస్తుతం మార్కెట్లో పలురకాల మట్టి ప్రమిదలు విక్రయానికి ఉంచారు. దీపోత్సవానికి ఒక్కరోజే ఉండడంతో మార్కెట్లు, రోడ్ల పక్కన ఉంచిన దుకాణాల్లో మట్టి ప్రమిదల విక్రయాలు ఊపందుకున్నాయి.

← ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజ

తిరువళ్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులోని కడంబత్తూరు, కమ్మవారిపాళయం గ్రామాల్లో అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కన్వీనర్ డాక్టర్ లైన్ పన్నీర్‌సెల్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఇందులో భాగంగా అయ్యప్ప స్వామి, గణపతి, శివుడు, పార్వతి, సుబ్రమణ్య స్వామి వార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, అయ్యప్ప 18 పడి మెట్లకు పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా చెన్నైకు చెందిన వీరమణిరాజు బృందం నిర్వహించిన అయ్యప్ప భజన పాటల కచ్చేరి భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి రమణ, పీఎంకే రాష్ట్ర ఉప కార్యదర్శి బాలయోగి, బిజేపి జాతీయ కార్యవర్గ సభ్యుడు లోకనాథన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణకారన్, తిరుత్తణి నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆర్యశ్రీనివాసన్, ఓబిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



← ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

అశ్వవాహనంపై విహరించిన అన్నామలైయార్



వేర్వేరుగా రథాలపై పరాశక్తి అమ్మ, చండికేశ్వరులు



అశ్వవాహనంపై స్వామివార్లను దర్శించుకుంటున్న భక్తులు

వేలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో అగ్నిక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన అరుణాచలేశ్వరాలయంలో గత నెల 24న ప్రారంభమైన కార్తిక దీపోత్సవాలు వైభవోపేతంగా జరుగుతన్నాయి. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున అశ్వ వాహనంపై ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్ ఉత్సవమూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అదేవిధంగా చిన్న అశ్వవాహనంపై గణపతిని ఊరేగించగా, ప్రత్యేక అలంకారంలో వల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, పరాశక్తి అమ్మవారు, చండికేశ్వరుడి ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. ఇదిలా ఉండగా, ఆదివారం రాత్రి వేర్వేరుగా పరాశక్తి అమ్మన్, చండికేశ్వరస్వామివార్ల రథోత్సవం ఆద్యంతం వేడుకగా సాగగా, హారతులతో భక్తులు ఎదురొచ్చి దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దఎత్తున పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌కు మత్స్య సంపద

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్‌కు చేపలు రాశులుగా వచ్చాయి. 'దిత్వా' తుఫాను కారణంగా జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దనే వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో సుమారు వారం రోజులు జాలర్లు ఇళ్లకే పరిమితమయ్యారు. శనివారం రాత్రి నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడం వాతావరణ అనుకూలించడంతో ఆదివారం వేకువజామున జాలర్లు చేపల వేటకు వెళ్లారు. సోమవారం ఉదయం జాలర్లు తీరానికి చేరుకోగా భారీగా చేపలు లభించాయి. కుళచ్చల్ షిఫింగ్ హార్బర్‌లో వేసిన చేపలు కొండలను తలపింపించాయి. కిలో కిలాత్తి చేపలు రూ.15కు విక్రయం కాగా, ఎగుమతులకు అనువైన రెడ్ స్నాపర్, విళ, పారై తదితర చేపలు మంచి ధర పలకడంతో జాలర్లు ఆనందం వ్యక్తం చేశారు.

కులచ్చల్ ఫిషింగ్ హార్బర్‌లో చేపల రాసులు →





కుంబాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా అంకాళపరమేశ్వరి ఆలయ కుంభాభిషేకం

తిరువళ్లూరు, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరులోని తిరుపాచ్చూర్ అంకాలపరమేశ్వరి అమ్మవారి ఆలయ కుంబాభిషేకం వైభవంగా జరిగింది. పురాతనమైన అంకాళపరమమేశ్వరి దేవస్థానంలో గత కొన్ని నెలలుగా మరమ్మత్తులతో పాటు, ఆలయానికి ఇటీవల జీర్ణోద్ధరణ పనులను హిందూ దేవాదాయశాఖ చేపట్టింది. పనులు పూర్తవడంతో కుంబాభిషేకాన్ని పురస్కరించుకుని గత మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం గణపతి హోమం నిర్వహించి ఆలయ గోపుర కలశంపై పుణ్యనదీ జలాలను అర్చకులు సంప్రోక్షించారు. ఈ వేడుక తిలకించేందుకు తిరువళ్లూరుతో పాటు, కడంబత్తూరు, వెంగల్, మేల్ నల్లాత్తూర్, కీల్ నల్లాత్తూర్ తదితర ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ఆలయ నిర్వాకులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



చెన్నైలో జరిగిన ప్రముఖ పారిశ్రామికవేత్త, కళాపోషకుడు దివంగత పి.ఓబుల్‌రెడ్డి శతజయంతి వేడుకల్లో భాగంగా తపాలా శాఖ రూపొందించిన ప్రత్యేక స్మారక స్టాంప్ ఆవిష్కరిస్తున్న అపోలో ఆస్పత్రుల గ్రూపు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి



ఐఐటీలో కాన్ఫరెన్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

త్వరలో కొత్త పరిశ్రమలు

● ఐఐటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి నారాయణ

ఏర్పేడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీకి త్వరలో కొత్త పరిశ్రమలు రానున్నాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర మంత్రి నారాయణ చెప్పారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో 8వ భారతీయ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన సోమవారం జరిగిన ఇండస్ట్రీ డే సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎంతో కృషిచేస్తున్నారనిచెప్పారు. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వం లీన్ కన్‌స్ట్రక్షన్ ప్రక్రియలను అమలు చేసి నిర్మాణరంగంలో సామర్థ్యాన్ని పెంచడం, వ్యర్థాలను తగ్గించడంపై దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వం తరఫున హాజరైన నిపుణులతో లీన్ కన్‌స్ట్రక్షన్ ఆవిష్కరణలు, ఉత్తమ పద్ధతులపై ఆయన చర్చించారు. విద్యారంగంలోని పరిశోధనలను, పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేయాలనే లక్ష్యమని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ ఇండస్ట్రీడే భారత నిర్మాణ రంగ భవిష్యత్తును సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు అకడమిక్ కఠోరతను, పరిశ్రమను ఉత్తమంగా మార్చడంలో ఐఐటీ చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. పారిశ్రామికవేత్త అనుప్ మాథ్యూ, ఐఎల్‌సీఈ సెక్రటరీ జనరల్ కైజాద్ కరంజావాలా తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.47 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,187

తలనీలాలు సమర్పించినవారు: 25,027





నీటి ఏనుగు



అడవి జింక



విదేశాల నుంచి తెచ్చిన మీర్‌కాట్ పిల్లలు



బూడిదరంగు కోళ్లు



చుక్కల దుప్పి పిల్లలు



అడవిపందులు



అడవిదున్న



థామిన్ జింక

కొత్త ప్రాణులకు పురుడుపోస్తున్న జూపార్కు

ఆసియా ఖండంలో అతిపెద్దదైన శ్రీవేంకటేశ్వర జూపార్కులో జంతు సంతతి క్రమంగా పెరుగుతోంది. 85రకాల వన్యప్రాణులున్న తిరుపతి జూలో వయసు, అనారోగ్య కారణాలతో కొన్ని మృతి చెందుతున్నాయి. మరోవైపు ఉన్న వన్యప్రాణులు కొత్తవాటికి జన్మనిస్తూ సంతతిని పెంచుకుంటున్నాయి. ఇతర దేశాల నుంచి తీసుకువచ్చినవి, మనదేశంలోని ఇతర జూల నుంచి తీసుకువచ్చిన వన్యప్రాణుల్లో మీర్‌కాట్, అడవి దున్న, బూడిదరంగు అడవి కోడి, నీటి ఏనుగు, అడవి జింక, అడవి పంది, చుక్కల దుప్పి, థామిన్ జింక వంటివి ఇక్కడే సంతానాన్ని వృద్ధి చేసుకున్నాయి. ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడి వాతావరణంలో ఇమడలేని కొన్ని ప్రాణులు మరణించాయని, రెండు నెలలలోనే మరి కొన్ని ఇక్కడే కొత్తవాటికి జన్మనిచ్చాయని తిరుపతి జూపార్క్ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ తెలిపారు. ఇక్కడే పుట్టిన ప్రాణులు ఈ వాతావరణానికి అలవాటు పడినట్లే. అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. అని ఆయన చెప్పారు. ఇతర జూల నుంచి వచ్చిన వాటి కోసం కొత్త ఎన్‌క్లోజర్‌లు సిద్ధం చేస్తున్నామని చంద్రప్రసాద్ తెలిపారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

పాపవినాశనం డ్యాం ఎంత భద్రం?

● అధ్యయనం చేస్తున్న కేంద్ర శాస్త్రవేత్తలు

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పావినాశనం డ్యాం పటిష్టత ఏ స్థితిలో ఉందో కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్తల బృందం పరిశీలిస్తోంది. 42 ఏళ్ల కిందట తిరుమల నీటి అవసరాల కోసం నిర్మించిన ఈ డ్యామ్ భద్రతపై టీటీడీ దృష్టి పెట్టింది. ఏపీ జనవరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు కూడా ఈ ఏడాది ఫిబ్రవరిలో పావినాశనం డ్యాంను పరిశీలించారు. డ్యాం గేట్లలో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేస్తే మరో 30 ఏళ్ల దాకా ఇబ్బంది లేదని సలహా ఇచ్చారు. అలాగే నేషనల్ డ్యాం సేఫ్టీ యాక్ట్ కింద కేంద్ర జలశక్తి విభాగానికి చెందిన సీఎస్ఎంఆర్ఎస్ ను అధ్యయనం చేయాల్సిందిగా టీటీడీ కోరింది. ఇందులో భాగంగా నవంబరు 26 నుంచి జలవనరుల శాఖ సీఈ వరప్రసాద్, ఎస్ఈ రాధాకృష్ణమూర్తి, ఈఈ రవిశంకర్‌రెడ్డి, టీటీడీ ఈఈ సుధాకర్ ఆధ్వర్యంలో సీఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు సెంథిల్, జాలే లింగేస్వామి, దీపక్‌కుమార్ శర్మ బృందం పాపవిశానం డ్యాంను పరిశీలిస్తోంది. డ్యాములో నీటి కిందభాగానికి రిమోట్ ద్వారా ఒక యంత్రాన్ని పంపారు. కిందభాగంలోని పలు ప్రాంతాల్లో ఫొటోలను తీస్తున్నారు. డ్యాం అడుగుభాగం ఎంత పటిష్టంగా ఉందో దీనిద్వారా నిర్ధారించుకుంటారు. మరో రెండు రోజుల్లో పరిశీలనను పూర్తిచేసి నివేదికను రాష్ట్ర జలవనరుల శాఖ విభాగానికి అందజేయనున్నారు.





పాపవినాశనం డ్యాం వద్ద సీఎస్ఎంఆర్ఎస్ బృందం - నీటిలోకి పంపుతున్న రిమోట్ ఆపరేట్ వెహికల్

తిరుమలలో 5 డ్యాములు: తిరుమల కొండపై ప్రస్తుతం ఐదు డ్యాములు ఉన్నాయి. 1963లో గోగర్భం డ్యామును నిర్మించింది. ఆతర్వాత భక్తుల సంఖ్య పెరగడంతో 1983లో పాపవినాశనం డ్యామును నిర్మించారు. 2002లో ఆకాశగంగ, 2011లో జంటప్రాజెక్టులుగా పిలిచే కుమారధార, పసుపుధార డ్యాములను నిర్మించారు. వీటి మొత్తం నిల్వ సామర్థ్యం 14,303 లక్షల గ్యాలన్లు.

డయల్ యువర్ సీఎండీకి 62 వినతులు



వినియోగదారుల సమస్యలు వింటున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి 62 వినతులు వచ్చాయి. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 9 జిల్లాల నుంచి వినియోగదారులు ఫోన్ ద్వారా తమ సమస్యలను సీఎండీ లోతేటి శివశంకర్ దృష్టికి తెచ్చారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, కాలిన, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా మార్చాలని, విద్యుత్ లైన్లు మార్పు చేయాలని, లోఓల్టేజ్ సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. గతనెల 24వ తేదీ వరకు వచ్చిన 265 ఫిర్యాదుల్లో 118 పరిష్కరించామన్నారు. వినియోగదారులు సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333కి కాల్ చేసి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అలాగే 9133331912కు చాట్‌చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎన్.శోబావాలంటీనా, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, ఎం.కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటరాజు, విజయన్ పాల్గొన్నారు.

‘గూడూరు’ సమస్య పరిశీలించండి

● మంత్రి అనగానికి ఎమ్మెల్యే సునీల్ వినతి
● సత్యవేడులో ఇన్‌చార్జి చెప్పినట్లు వినాల్సిందేనన్న అనగాని
● తిరుపతిలో టీడీపీ శ్రేణులు, ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ

తిరుపతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతికి సుమారు మూడు నెలల తర్వాత సోమవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ బిజీబిజీగా గడిపారు. ఉదయం జీవకోనలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఆయన రేణిగుంట రోడ్డులోని టీడీపీ పార్లమెంటు కార్యాలయానికి చేరుకున్నారు. ఆ పార్టీ నేతలు, శ్రేణులు, ప్రజలను కలుసుకున్నారు. గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరుజిల్లాలో విలీనంచేసేఅంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మంత్రిని అభ్యర్థించారు. పలువురు నాయకులతో కలసి బృందంగా వచ్చిన ఆయన మంత్రి ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చంద్రబాబు, లోకేశ్ ఎన్నికల్లో హామీలిచ్చారని గుర్తుచేశారు. మంత్రుల ఉపసంఘం తొలుత చేసిన సిఫారసుల్లో గూడూరు విలీనం అంశంఉందని, తీరా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే సమయంలో దాన్ని పక్కన పెట్టిందని వాపోయారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి..తిరిగి నెల్లూరులో విలీనం చేసేలా ఒప్పించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం కూడా అందజేశారు.

వైసీపీ నుంచీ వచ్చిన వారికే ప్రాధాన్యం: సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల నుంచి పలువురు కార్యకర్తలు మంత్రిని కలిశారు. వైసీపీనుంచీ వచ్చినవారికే పనులు జరుగుతున్నాయని, సమన్వయకర్త వారినే వెంటపెట్టుకుని ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ‘ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చి, పనిచేసినవైసీపీవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. ఎన్నికల తర్వాత చేరిన వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చేది లేదు. అధిష్ఠానం సమన్వయకర్తగా నియమించిన శంకర్‌రెడ్డిమాటకే పార్టీలో విలువ ఉంటుంది. శ్రేణులు ఆయన్ను అనుసరించుకుని వెళ్లాలి. నానియోజకవర్గంలోనూ ఇలాంటి సమస్య ఉంది. నేనూ అధిష్ఠానం ఆదేశాల్ని గౌరవించి అందరినీ కలుపుకొని పోతున్నా’ అని మంత్రి సమాధానమిచ్చారు.

కార్పొరేటర్ అన్నా సంధ్యకు పరామర్శ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న జీవకోన కార్పొరేటర్ అన్నా సంధ్య ఇంటికెళ్లి మంత్రి అనగాని సత్యప్రసాద్ పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందంటూ వాకబు చేశారు. పార్టీతో పాటు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

టీడీపీ కార్యాలయానికి స్థల పరిశీలన: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలో టీడీపీ పార్లమెంటు కార్యాలయ భవనానికి ఇటీవల ప్రభుత్వం కేటాయించిన భూమిని మంత్రి అనగాని పరిశీలించారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కార్యాలయానికి చేరుకుని నేతలను కలుసుకున్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పనుసులేటి హరిప్రసాద్ నివాసానికీ మంత్రి వెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు జి.నరసింహ యాదవ్, సుగుణమ్మ, తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, సత్యవేడు టీడీపీ ఇంఛార్జి శంకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, గంగమ్మ గుడి చైర్మన్ మహేశ్ యాదవ్, కార్పొరేటర్లు అన్నా అనిత, నరసింహాచారి, ఎస్కే బాబు, నరేంద్ర, నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి, పులుగోరు మురళి, జేబీ శ్రీనివాస్ తదితరులున్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం

ఇద్దరు ‘ఎర్ర’ స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా



నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం రాష్ట్ర ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. చిత్తూరు ఎస్పీ తుషార్ దూడి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా సదుం మండలం బోరగమందకు చెందిన పి.వెంకటరమణ, ఆ మండలానికే చెందిన మల్లెల హరినాథ్ 2018లో రొంపిచెర్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా అప్పటి పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసును చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదలాయించారు. కొన్ని నెలలుగా ఇక్కడ కేసు విచారణ జరిగింది. కేసుకు సంబంధించి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, అప్పటి రొంపిచెర్ల ఎస్ఐ జయరాంనాయక్, ప్రస్తుత ఎస్ఐ హరిప్రసాద్, కోర్టు లైజనింగ్ కానిస్టేబుల్ రవి, నిందితులకు సంబంధించి సాక్ష్యాధారాలు కోర్టు ఎదుట సాక్ష్యాధారాలు హాజరుపరచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కౌశల్



గౌతమ్ రాజు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీనటులు గౌతమ్ రాజు, కౌశల్, తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడి ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించరా?

● సురుటుపల్లి ఆలయ ఈవోపై ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం

నాగలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, అధికారులకు మధ్య ప్రొటోకాల్ రగడ ముదురుతోంది. నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వర ఆలయంలో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఈవో లతపై సోమవారం ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు రోజుల క్రితం ఆలయంలో శని ప్రదోష పూజల నిమిత్తం ముద్రించిన కరపత్రాల్లో స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం పేరు లేదంటూ కొందరు వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఆలయంలోని ఈవో కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని ప్రొటోకాల్‌పై నిలదీశారు. ఈవో వ్యవహార శైలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని చెప్పారు. రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారంటూ విమర్శించారు. పాలకమండలి ఆత్మీయ సమావేశం పేరుతో ఆలయంలో పార్టీ సమావేశాన్ని నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆలయ ట్రస్టు బోర్డు నియామకం నియమ నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిందని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుడికి, మద్యం వ్యాపారాలు చేసుకుంటున్న వ్యక్తికి చైర్మన్‌గా ఎలా చోటు కల్పిస్తారని నిలదీశారు. గతంలో టీటీడీలో బంగారు నగల దొంగతనం కేసులో నిందితుడిని.. చెన్నైలో స్థిర నివాసమున్న మహిళను సభ్యులుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. బోర్డు నిబంధనల మేరకు గిరిజనులకు ఎందుకు చోటు కల్పించలేదని అడిగారు. ప్రొటోకాల్ విషయమై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. తగిన ఆధారాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం. కాగా, నూతన సంవత్సరంలో శివయ్య ఎలాఅనుగ్రహిస్తే అలా నిర్ణయం తీసుకుంటానని ఈ సందర్భంగా ఆదిమూలం పేర్కొనడం గమనార్హం. టీడీపీ నాయకులు మురళి, ఎస్ఎం సురేష్, మురళి, సర్పంచ్ కాంతమ్మ, సుబ్రహ్మణ్యం, అంబేడ్కర్ సంఘ నాయకుడు జై భీమ్ అధ్యక్షుడు ధన తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలోని కార్యాలయంలో ఈవోని నిలదీస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

చైర్మన్ చెబితేనే చేశా: ఈవో

ఆలయ కరపత్రాలపై ఎమ్మెల్యే పేరును ముద్రించకపోవడంపై ఈవో లత వివరణ ఇస్తూ... చైర్మన్ చెబితేనే చేశానన్నారు. ఒకసారికి క్షమించాలని ఇంకెప్పుడు ఇలాంటి ఘటన పునరావృత్తం కాకుండా చూసుకుంటానంటూ ఎమ్మెల్యేకి చెప్పారు. ‘ఆలయాలకు చైర్మన్లు వస్తారు పోతారు. ఇక్కడ భక్తుల సేవే పరమావధిగా ఉండాలి. చైర్మన్ చెబితే తరతరాలుగా ఉభయదారులుగా వ్యవహరిస్తున్న వారిని కూడా మార్చేస్తారా?’ అంటూ ఈవో ఆగ్రహం వ్యక్తంచేశారు.

నకిలీ సీఐ అరెస్ట్



శివకుమార్‌ను అరెస్టు చూపుతున్న పోలీసులు

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య విభేదాలను ఆసరాగా చేసుకుని సీఐ అవతారంలో బెదిరించిన శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా తెలిపారు. ఆయన వివరాల మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ అప్పేపల్లెకు చెందిన రెడ్డి ఈశ్వర్, భానుశ్రీ దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. భానుశ్రీ తరఫున కేవీపల్లె మండలం చిన్నకమ్మపల్లెకు చెందిన శివకుమార్ తాను కడప స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తున్నానని, భానుశ్రీని వేధిస్తే చర్యలు తప్పవని రెడ్డి ఈశ్వర్‌ను బెదిరించాడు. దీంతో శివకుమార్‌పై రెడ్డి ఈశ్వర్ భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి శివకుమార్ సీఐ కాదని నిర్ధారించుకుని అతని కోసం గాలింపు చేపట్టారు. భాకరాపేట సమీపంలోని మామా బావమరిది హోటల్ సమీపంలో సోమవారం అతన్ని అరెస్టు చేశారు. శివకుమార్ ఇంతకు ముందు ఉద్యోగం తీసిస్తానని కలకడ మండలానికి చెందిన ఆంజినేయులు దగ్గర రూ.8 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్ర, ట్రైనీ ఎస్ఐ రాఘవరెడ్డి పాల్గొన్నారు.